రుణమాఫీపై అపోహలు వద్దు

- వందశాతం అమలు చేస్తాం
- ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

రుణమాఫీపై అధికారులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి

తిమ్మాజిపేట, ఆగస్టు 30 : రైతు రుణ మాఫీపై సందేహాలు అవసరం లేదని, సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు వంద శాతం రుణమాఫీ అమలు చేస్తామని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని ఇప్పలపల్లి గ్రామంలోని రైతువేదిక లో వ్యవసాయ అధికారులు, రైతులతో రుణమాఫీ గురించి చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులు ఆందోళన చెందొద్దని, అందరికీ చే స్తామన్నారు. చిన్నచిన్న పొరపాట్లు ఉంటే వెంటనే వాటిని సరి చేసి, రైతులను న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. అంతుకుముందు ఆయన మండలంలో వివిధ గ్రామాల్లో మృతి చెందిన కుటుంబాలను ప రామర్శించారు. కార్యక్రమంలో ఏవో కమల్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

అర్హులందరికీ మాఫీ చేస్తాం

నాగర్‌కర్నూల్, ఆగస్టు 30(నమస్తే తెలంగాణ) : అర్హులైన రైతులందరికీ రుణ మాఫీ చేస్తామని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యే డాక్టర్ రాజేశ్‌రెడ్డి అన్నారు. తెలకపల్లి మండలం రాంరెడ్డిపల్లిలో శుక్రవారం ఆయన ఎమ్మెల్యే డాక్టర్ రాజేశ్‌రెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి రైతులతో మాట్లాడారు.

ప్రజలు దుష్ప్రచారం నమ్మకుండా కాంగ్రెస్ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డికి మద్దతు ఇవ్వాలని కోరారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే

నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేశ్‌రెడ్డి మానవత్వం చాటుకున్నారు. జిల్లా కేంద్రం నుంచి తెలకపల్లి వెళ్తుండగా మంతటిగడ్డ వద్ద రోడ్డు ప్రమాదం జరిగింది. ఇది చూసిన ఆయన వెంటనే అక్కడికి చేరుకొని బాధితుడిని పరామర్శించి, మెరుగైన వైద్య సేవలకు జిల్లా దవాఖానకు తరలించారు. డాక్టర్లతో ఫోన్‌లో మాట్లాడి మంచి వైద్యం అందించాలని ఆదేశించారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో ధర్నా

వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

నాగర్‌కర్నూల్, ఆగస్టు 30(నమస్తే తెలంగాణ): జిల్లా సర్వేయర్ ఏడీని సస్పెండ్ చేయాలని బీఎస్‌పీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బీఎస్ పీ నాయకులు మాట్లాడుతూ తెలకపల్లికి చెందిన రాములు గత 20ఏండ్లుగా మోకా మీద ఉండగా కొందరు వ్యక్తులు గొడవకు దిగుతున్నారని ఆరోపించారు. ఈ ఘటనలో సర్వేయర్ ఏడీ తప్పుడు సర్వే చేసి, రాములుకు అన్యాయం చేశారని ఆరోపించారు. దీనిపై పూర్తిస్థాయిలో భూమి సర్వే జరిపించి, న్యాయం చేయాలని కలెక్టరేట్‌లో వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇన్‌చార్జి అంతటి నాగన్న, జిల్లా అధ్యక్షుడు పృథ్వీరాజ్, అసెంబ్లీ ఇన్‌చార్జి కొత్తపల్లి కుమార్, ప్రధాన కార్యదర్శి కల్యాణ్, కార్యదర్శి రాంచందర్, నాగేశ్, బాలనాగులు, బీఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు సాయిబాబ పాల్గొన్నారు.

రైతులు దరఖాస్తు చేసుకోవాలి

లింగాల, ఆగస్టు 30 : రుణమాఫీ కాని మండలంలోని ఆయా గ్రామాల రైతులు ఈనెల 31వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని నాగర్‌కర్నూల్ ఏడీఏ రుణమాఫీ ప్రత్యేకాధికారి పూర్ణచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక రైతు వేదికలో నిర్వహించిన రుణమాఫీ దరఖాస్తు స్వీకరణను పరిశీలించారు. ఈ సందర్భంగా నాగర్‌కర్నూల్ ఏడీఏ రుణమాఫీ ప్రత్యేకాధికారి పూర్ణచంద్రారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మూడు దఫాలుగా రైతు రుణమాఫీ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న రుణమాఫీలో తలెత్తిన వివిధ సాంకేతిక లోపాలతో రుణమాఫీ కాని రైతుల సమస్యలను పరిష్కరించేందుకు వ్యవసాయ శాఖ ఆన్‌లైన్ పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకొవచ్చినట్లు తెలిపారు. దీనిలో భాగంగా కుటుంబ సభ్యుల నిర్ధారణ కాని కుటుంబాలకు వ్యవసాయ శాఖ కార్యాలయంలో నమోదు చేయడం జరగుతుందన్నారు. కుటుంబ యజమానితో పాటు వారి కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీలు, పట్టాదారు పాసుపుస్తకం, క్రాప్‌లోన్ ఖాత స్టేట్‌మెంట్, ధ్రువీకరణ పత్రాలను తీసుకొని రైతు వేదికలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఏఈవోలు పాల్గొన్నారు.

షరతులు లేకుండా మాఫీ చేయాలి

చారకొండ, ఆగస్టు 30 : కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి షరతులు, ఆంక్షలు లేకుండా రైతులందరికీ రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా నేత బాలస్వామి అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుణమాఫీపై స్పష్టత లేక రైతులు అయ్యోమయానికి గురవుతున్నారని అన్నారు. ఎన్నికల సమయంలో ఏకకాలంలో రూ.2లక్షలు రుణమాఫీ చేస్తామని ప్రకటించి రుణమాఫీ చేయడంలో పూర్తిగా విఫలమైయ్యారని చెప్పారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఎన్నికల్లో చేసిన వాగ్దానం ప్రకారం రుణం తీసుకున్న ప్రతి రైతుకూ రుణమాఫీ చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకు లు ఎల్కశ్రీను, వెంకటయ్య, రాములు పాల్గొన్నారు.

పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలి

నాగర్‌కర్నూల్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : పోలీసులు విధి నిర్వహణలో పడి ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొదని ఎమ్మెల్యే డాక్టర్ రాజేశ్‌రెడ్డి, కలెక్టర్ బదావత్ సంతోష్, ఎస్పీ వైభవ్ గైక్వాడ్ రఘునాథ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో జిల్లా పోలీసు కుటుంబాల ఆరోగ్య సేవల యూనిట్ ఆస్పత్రిని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలీసు శాఖలో పని చేస్తున్న సివిల్, ఏఆర్ హోం గార్డులు, ఆఫీసర్లు, కానిస్టేబుళ్లు, ఎస్సై, సీఐ ఆపై అన్ని శాఖల సిబ్బంది ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలన్నారు. జిల్లా వైద్యఆరోగ్య శాఖ పూర్తిగా సహకరిస్తుందన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో స్వరాజ్యలక్ష్మి, అడిషనల్ ఏఆర్ ఎస్పీ భరత్, డీఎస్పీలు సత్యనారాయణ, శ్రీనివాసులు, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, నర్సింహులు, సీఐ కనకయ్య, వైద్య సిబ్బంది, అధికారులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా పనులు పూర్తి చేయాలి

- కలెక్టర్ సంతోష్

వంగూరు : అంగన్‌వాడీ టీచర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ సంతోష్

వంగూరు, ఆగస్టు 30 : మండలంలోని కొండారెడ్డిపల్లిలో జరిగే పనులను వేగవంతం చేసి సకాలంలో పూర్తి చేయాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. మండలంలోని కొండారెడ్డిపల్లిలో జరుగుతున్న అభివృద్ధి పనులను శుక్రవారం కలెక్టర్ సంతోష్ పరిశీలించారు. గ్రామంలో జరుగుతున్న పంచాయతీ నూతన భవనం, బీసీ కమ్యూనిటీ హాల్, గ్రంథాలయం పనులను పరిశీలించారు. అదేవిధంగా అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేసి నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. అనంతరం అధికారులతో సమీక్ష నిర్వహించి గ్రామంలో జరుగుతున్న పనులను నాణ్యతతో చేపట్టడంతోపాటు త్వరగా పూర్తయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కేవీఎన్‌రెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, వేమారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ల పరిశీలన

కల్వకుర్తి రూరల్, ఆగస్టు 30 : కల్వకుర్తి పట్టణంలోని తాసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం కలెక్టర్ సంతోష్‌కుమార్ సందర్శించారు. ఈ సందర్భంగా రెవెన్యూ కార్యాలయంలో పలు రిజిస్ట్రేషన్లను పరిశీలించారు. ధరణి రిజిస్ట్రేషన్లలో ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఆర్డీవో శ్రీను, తాసీల్దార్ ఇబ్రహీం, కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

సమాజంపై అవగాహన కల్పించాలి

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఎంపీ

బిజినేపల్లి, ఆగస్టు 30 : విద్యార్థులకు చదువుతోపాటు సమాజంపై అవగాహన కల్పించాలని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వట్టెం గ్రామంలో నవోదయ పాఠశాలలో 'పార్లమెంట్ నిర్వహణ' అంశంపై నిర్వహించిన సదస్సులో వారు పాల్గొని మట్లాడారు. పార్లమెంటరీ ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగబద్ధ పాలనలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ భాస్కర్‌కుమార్, వెంకట్‌రెడ్డి, భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు

ఊర్కొండ, ఆగస్టు 30 : మండలంలోని బొమ్మరాజుపల్లిలో అంతుచిక్కని ఆడవి జంతువును కనిపెట్టేందుకు శుక్రవారం రెండు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినట్లు ఫారెస్టు రేంజ్ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు. రైతులు అధైర్య పడొద్దని రెండు రోజుల్లో ఆడవి జంతువును గుర్తించి తగు చర్యలు చేపడుతామన్నారు. కార్యక్రమంలో కానిస్టేబుల్ చంద్రుడు, రైతులు ఆంజనేయులు, చంద్రకాంత్ పాల్గొన్నారు.

దోమలపెంటలో ఉచిత కంటి పరీక్షలు

అమ్రాబాద్, ఆగస్టు 30 : మండలంలోని దోమలపెంటలో ప్రభుత్వ ప్రాజెక్టు పాఠశాల ఆవరణలో మెడివిజన్ ఐ కేర్ సెంటర్, రాములమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత కంటి పరీక్షలను నిర్వహించారు. మొత్తం 160 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా 56 మందికి కంటి అద్దాలను అందజేశామని, 36 మందికి ఆపరేషన్ చేయవల్సిన అవసరముందని రాములమ్మ ఫౌండేషన్ అధినేత కటకం వెంకటేశ్ తెలిపారు. మొదటి విడత పది మందిని హైదరాబాద్‌కు తీసుకెళ్లి ఉచిత కంటి ఆపరేషన్‌లు చేయిస్తామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మెడివిజన్ ఐ కేర్ సిబ్బంది, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఓటర్ జాబితాలో సవరణలు చేపట్టాలి

- అదనపు కలెక్టర్ దేవసహాయం

వంగూరు : రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

వంగూరు, ఆగస్టు 30 : ప్రభుత్వం త్వరలో చేపట్టే గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం ఓటర్ జాబితాలో సవరణలను వెంటనే చేపట్టాలని అదనపు కలెక్టర్ దేవసహాయం ఎంపీడీవోను ఆదేశించారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఆయన అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ ఎన్నికల కోసం వార్డుల వారీగా ఓటర్ జాబితాను వెంటనే సవరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో విజయభాస్కర్, ఎంపీవో వెంకటేశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఓటర్ లిస్ట్ ప్రక్రియ పరిశీలన

ఊర్కొండ, ఆగస్టు 30 : మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం జెడ్పీ సీఈవో గోపాల్‌నాయక్ ఓటర్ లిస్టు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఓటరు జాబితాను పారదర్శికంగా ఎలాంటి తప్పులు లేకుండా వార్డు చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో కృష్ణయ్య, ఎంపీవో లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు.

శ్రీశైలంలో అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలం, ఆగస్టు 30 : శ్రీశైల దేవస్థానం భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమానికి రూ.లక్ష విరాళం అందజేశారు. శుక్రవారం హైదరాబాద్‌కు చెందిన వెంకట మోహన్‌రావు దంపతులు ఆలయ పర్యవేక్షకురాలు హిమబిందుకు చెక్కు రూపంలో రూ.లక్ష అందించారు. దాతలకు భ్రమరాంభికా మల్లికార్జున స్వామి అమ్మవార్ల దర్శనాన్ని కల్పించి ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల శేషవస్త్రాలు, ప్రసాదాలు, జ్ఞాపిక పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు, దాతలు ఉన్నారు.

జైల్‌ను పరిశీలించిన న్యాయమూర్తి

సబ్ జైల్‌ను పరిశీలిస్తున్న న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి సబిత

నాగర్‌కర్నూల్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రన్యాయ సేవా అధికార సంస్థ ఆదేశానుసారం జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సబ్ జైల్‌ను శుక్రవారం జిల్లా లీగల్ సర్వీసెస్ కార్యదర్శి జి.సబిత పరిశీలించారు. ఈ సందర్భం గా జైలులో ఖైదీలకు అందుతున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. అలాగే వంటగది, నిత్యావసర సరుకులు పరిశీలించారు. అనంతరం ఖైదీలతో మాట్లాడుతూ ఎవరైనా ఆర్థిక స్థోమత లేక న్యాయవాదిని నియమించుకోలేకుంటే తమ సంస్థ తరపున ఉచితంగా న్యాయవాదిని నియమిస్తామన్నారు. అనంతరం జైలు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని జైలు సూపరింటెండెంట్ నాగరాజును ఆదేశించారు.

పెండింగ్ వేతనాలు సకాలంలో చెల్లించాలి

- సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేశ్

అచ్చంపేటరూరల్, ఆగస్టు 30 : అచ్చంపేట వంద పడకల సర్కారు దవాఖానలో పనిచేస్తున్న అవుట్ సోర్సింగ్ సిబ్బందికి పెండింగ్ వేతనాలను సకాలంలో చెల్లించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. మల్లేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం సీఐటీయూ అనుబంధ సంఘం మెడికల్ అండ్ హెల్త్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వేతనాలు చెల్లించాలని ఆందోళన చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూడు నెలలుగా సిబ్బందికి ఏజెన్సీ నిర్వాహకులు వేతనాలు, పీఎఫ్ చెల్లించడం లేదన్నారు. వచ్చే నెల 2వ తేదీ వరకు సమస్య పరిష్కారం కాకుంటే విధులను బహిష్కరించి నిరవధిక సమ్మె చేపడుతామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్‌లతో కూడిన సమ్మె నోటీసును సూపరింటెండెంట్‌కు అందజేశారు.

తల్లీ బైలెల్లినాదో..

- ఆయా గ్రామాల్లో ఘనంగా బోనాల పండుగ

బిజినేపల్లి : పాలెంలో బోనాల ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు

చారకొండ : తిమ్మాయిపల్లిలో బోనాలతో మహిళలు

చారకొండ, ఆగస్టు 30 : మండలంలోని తిమ్మాయిపల్లిలో ముత్యాలమ్మ తల్లి బోనాల పండుగను గ్రామస్తులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు బోనాలు ఎత్తుకొని డప్పు వాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులు చెల్లించుకొన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు రవీందర్, గ్రామస్తులు ఉన్నారు.

బిజినేపల్లిలో..

బిజినేపల్లి, ఆగస్టు 30 : మండలంలోని పాలెంలో శుక్రవారం కర్రెమ్మ బోనాల పండుగను ఘనంగా జరుపుకొన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో పుర వీధుల గుండా ఊరేగింపు వెళ్లిగా కర్రెమ్మ ఆలయంలో అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ లావణ్యానాగరాజు, రాములు, రాంచందర్, రామకృష్ణ, వెంకటయ్య పాల్గొన్నారు.

తుమ్మెన్‌పేటలో..

బల్మూరు, ఆగస్టు 30 : మండలంలోని తుమ్మెన్‌పేటలో శ్రావణ నాలుగో శుక్రవారం సందర్భంగా గ్రామంలోని ఈదమ్మ, ఎల్లమ్మ దేవతలకు భక్తులు ఒడిబియ్యం పోశారు. గ్రామంలో స్థానిక భ్రమరాంబిక ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ తిరుపతిరావు పాల్గొన్నారు.

పెద్దాపూర్‌లో..

వెల్దండ, ఆగస్టు 30 : మండలంలోని పెద్దాపూర్‌లో గ్రామ దేవత పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆడపడుచులు పసుపు, కుంకుమ, వేపాకులతో శోభాయమానంగా అలంకరించిన బోనాలతో గ్రామంలో ఆటా, పాటలతో పోచమ్మ ఆలయానికి ఊరేగింపు చేపట్టారు. అనంతరం పోచమ్మ, ఈదమ్మ ఆలయాల్లో అమ్మవార్లకు బోనాలు, నైవేద్యం సమర్పించి తమ మొక్కులు చెల్లించుకొన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

తర్నికల్‌లో..

కల్వకుర్తి, ఆగస్టు 30 : కల్వకుర్తి మండలం తర్నికల్‌లో నిర్వహిస్తున్న ఈదమ్మ తల్లి బోనాలలో భాగంగా శుక్రవారం ఎద్దుల బండ్ల బోనాలు నిర్వహించారు. ఎద్దుల బండ్లను ఈదమ్మ తల్లి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఉత్సవాలకు ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉత్సక కమిటీ సభ్యులు ఉప్పల వెంకటేశ్‌ను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సురేశ్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

వెల్దండ : పెద్దాపూర్‌లో బోనాల ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

4.6 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

కల్వకుర్తి రూరల్, ఆగస్టు 30 : కల్వకుర్తి పట్టణంలోని శివాజీ చౌరస్తా సమీపంలోని ఎజాస్ అనే వ్యాపారి దుకాణంలో నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని కల్వకుర్తి పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. దుకాణంలో అక్రమంగా పీడీఎస్ బియ్యాన్ని నిల్వ చేసి ఉంచారనే సమాచారంతో కల్వకుర్తి ఎస్సై-2 రాంచందర్‌జీ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ రాఘవేందర్‌రెడ్డిలు సంయుక్తంగా దాడులు నిర్వహించి షాపులో నిల్వ ఉంచిన బియ్యాన్ని స్వాధీనం చేసుకుని కేసునమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

డీహెచ్‌పీఎస్ సభ్యత్వ నమోదు

నాగర్‌కర్నూల్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : జిల్లా కేంద్రంలోని ఉయ్యాలవాడలో డీహెచ్‌పీఎస్ సభ్యత్వ నమోదును జిల్లా అధ్యక్షుడు కొమ్ము భరత్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004లో ప్రారంభమైన సంస్థ దళిత హక్కుల కోసం పోరాడుతుందన్నారు. దళితులందరూ ఈ సంఘంలో భాగస్వాములు కావాన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు కురుమూర్తి, ఊషన్న, బాలమశన్న, బాలరాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కుటుంబ నిర్ధారణ సర్వే

చారకొండ, ఆగస్టు 30 : మండలంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు రేషన్ కార్డు లేని రైతుల కుటుంబ సభ్యుల నిర్ధారణ సర్వే కొనసాగుతున్నది. శుక్రవారం జూపల్లి రైతు వేదికలో కుటుంబ సభ్యుల నిర్ధారణ సర్వే చేపట్టారు. ఈ సందర్భంగా ఏవో తనూజ మాట్లాడతూ రేషన్ కార్డులు లేని రైతులు ఆయా గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వేలో వారి వివరాలను నమోదు చేయించుకోవాలన్నారు. రైతుల కుటుంబ సభ్యుల ఆధార్‌కార్డులు, పట్టాపాసుపుస్తకం, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌తో పాటు దరఖాస్తు ఫారంపై రెవెన్యూ స్టాంపుపై రైతు సంతకం చేసి ఇవ్వాలని వివరించారు. సర్వేలో ఏఈవోలు వంశీ, సంతోషి, మహేశ్వరి, అనుష, సుష్మ, అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సై వెంకట్‌రెడ్డికి సన్మానం

ఎస్సై వెంకట్‌రెడ్డిని సన్మానిస్తున్న నాయకులు

చారకొండ, ఆగస్టు 30: ఇటీవల నూతనంగా చారకొండ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన వెంకట్‌రెడ్డికి శుక్రవారం డీసీసీ జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటయ్యయాదవ్ ఆధ్వర్యంలో శాలువాతో ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో నాయకులు జంగయ్య, లింగయ్య, సత్యంయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంతోషిమాత పూజలు

ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నాగర్‌కర్నూల్, ఆగస్టు 30 (నమస్తే తెలంగాణ) : నాగర్‌కర్నూల్‌లో క్రోధినామ సంవత్సరం శ్రావణమాసం చివరి శుక్రవారం రోజు పలు ఆలయాల్లో సామూహిక వరలక్ష్మి వ్రతాలు వైభవంగా జరిగాయి. జిల్లా కేంద్రంలోని సంతోషిమాత, జ్ఞాన సరస్వతీ, రామలయంలో వరలక్ష్మి వ్రతాలను భక్తులు నిర్వహించారు. ఓంనగర్‌లోని సంతోషిమాత ఆలయంలో మక్తల్ ఎమ్మెల్యే సతీమణి లలిత ప్రత్యేకంగా పూజలు చేశారు. అమ్మవారికి ఐదు గ్రాముల బంగారం బొట్టును, 50గ్రాముల వెండి గిన్నెలను బహుకరించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి ప్రకాశ్ శర్మచే అమ్మవారికి అభిషేకాలు, కుంకుమార్చన పారాయణ పఠనం జరిగింది. సరస్వతీ ఆలయంలో పూజారి నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో లలిత సహస్రనామార్చన, కుంకుమార్చన జరిపించారు. రామాలయంలో ప్రధాన అర్చకుడు కందాడై వరదరాజన్ అయ్యంగార్ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మి వ్రతాలు జరిగాయి. కార్యక్రమాల్లో నిర్వాహకులు ఈశ్వరయ్య, భాగ్యమ్మ, రవీందర్, ఇందుమతి, మల్లేశ్, జ్యోతి, రమాదేవి, శారద తదితరులు పాల్గొన్నారు.

పేదల ఇండ్లు కూల్చడం ప్రభుత్వానికి తగదు

సమావేశంలో మాట్లాడుతున్న పోలె అశోక్

వెల్దండ, ఆగస్టు 30 : పేదల ఇండ్లు కూల్చడం కాంగ్రెస్ ప్రభుత్వానికి తగదని వెల్దండ మండల బీఆర్ఎస్ నాయకుడు పోలె అశోక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి ముందస్తూ సమాచారం లేకుండా పాలమూరు జిల్లా కేంద్రంలో హైడ్రా పేరుతో పేదల నివాస ఇండ్లు కూల్చడం ఎంత వరకు సమంజసమన్నారు. కాంగ్రెస్ అరాచకాలు తెలంగాణ ప్రజలు గమనిస్తూన్నారని పేర్కొన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకుడు జోగు రవి ఉన్నారు.

మినీ గురుకుల పాఠశాలకు వాషింగ్ మిషన్ వితరణ

వాషింగ్ మిషన్‌ను అందజేస్తున్న దాతలు

లింగాల, ఆగస్టు 30 : స్థానిక మినీ గురుకుల గిరిజన బాలికల పాఠశాలకు శుక్రవారం 1988-89 ఎస్ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు వాషింగ్ మిషన్‌ను వితరణ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు భాగ్యలక్ష్మి మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల, నిరుపేద కుటుంబాలకు చెందిన పిల్లలు ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యశిస్తున్నారని వారిని బలోపేతం చేయడానికి మౌలిక వసతుల కల్పన కోసం దాతలు కృషి చేయడం హర్షణీయమన్నారు. దాతలు మహేశ్, హన్మంతు, వెంకటస్వామి, సుజాత, అశోక్‌లను పాఠశాల యాజమాన్యం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయురాలు పాల్గొన్నారు.

కాటేజీలను తాకిన వరద జలాలు

కొల్లాపూర్, ఆగస్టు 30: కొల్లాపూర్ మండలం సోమశిల గ్రామంలో శుక్రవారం కృష్ణానది జలాలు కాటేజీల వద్దకు చేరాయి. ఎగువ ప్రాంతం నుంచి భారీ ఎత్తున వరద వస్తుండడంతో సోమశిల ప్రాంతం నదీ జాలలతో సుందరంగా మారింది. కృష్ణానది తీరం వెంట సోమశిల, అమరగిరి పుష్కర ఘాట్ల వద్ద వరద నీరు ప్రవహిస్తుండడంతో పర్యాటకుల సందడి నెలకొంటుంది. నది జాలాలోకి పర్యాటకులు వెళ్లకుండా సంబంధిత అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

APGVB ఉప్పునుంతల, ఊర్కొండపేట గ్రామాలలో
ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్‌కు ఆఫీస్ అద్దెకు కావలెను
గ్రౌండ్ ఫ్లోర్‌లో 1500-1800 స్క్వేర్ ఫీట్ కలిగి పార్కింగ్, నీటి సౌకర్యం ఉండవలెను.
ఆసక్తి గల వారెవరైనా 15 రోజులలో ఉప్పునుంతల, ఊర్కొండపేట గ్రామాలలో భవనము లేదా ఖాళీ స్థలం కలిగి ఉంటే ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్, ఉప్పునుంతల, ఊర్కొండపేట బ్రాంచ్‌లలో సంప్రదించగలరు. -బ్రాంచ్ మేనేజర్
9490157314 ఉప్పునుంతల | 9490157329 ఊర్కొండపేట

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
★మహబూబ్‌నగ